క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, ఆశ్వీజ మాసం, రేవతి నక్షత్రం, త్రయోదశి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నవంబర్ 2న మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు: మార్టూరు మండల సర్వసభ్య సమావేశం నవంబరు 2వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీ నితిన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భూక్యా శాంతిబాయి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో నిర్వహించనున్న కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రేపు మండల సమావేశం

బల్లికురవ: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నా ఎంపీడీవో సీహెచ్ కృష్ణ గురువారం తెలిపారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తామని సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో చెప్పారు.

నేడు వంకాయలపాడులో గడప గడపకు..

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని వంకాయలపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ హాజరవుతున్నట్లు పార్టీ కార్యాలయం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో ప్రజలకు ఆయన అందుబాటులో ఉంటారని వారు తెలిపారు. నియోజక వర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా వారు తెలియజేశారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవం



పూజలు చేస్తున్న అర్చకుడు

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద వెలసియున్న అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిపారు. అర్చకులు, యాజ్ఞికులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు.

పాల ట్యాంకర్, మినీ వ్యాన్ ఢీ



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ సుబ్బయ్య

అద్దంకి: బొప్పాయి కాయల లోడు మినీ వ్యాన్, పాల ట్యాంకరు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ గుండ్లకమ్మ బ్రిడ్జిపై జరిగింది. అందిన సమాచారం మేరకు.. అద్దంకి వైపు నుంచి వస్తున్న బొప్పాయి లోడ్ వ్యాన్, దర్శి వైపు నుంచి వస్తున్న పాల లారీని ఢీకొట్టింది. దీంతో బొప్పాయి లోడ్ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ గోపిశెట్టి సుబ్బయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది స్థానికులు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీశారు. తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరువాత మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

ఆరోగ్యానికి భరోసా జగనన్న సురక్ష



ఆరోగ్య సురక్ష కార్డు అందిస్తున్న శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య



కొత్తపాలెంలో శిబిరానికి హాజరైన వైద్యులు, సిబ్బంది

- రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య
- రోగులకు మందుల పంపిణీ

అద్దంకి/బల్లికురవ: జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్యానికి భరోసా అని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు–1 సచివాలయ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణచైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందన్నారు. లక్షలాది మందికి వైద్యులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి వారికి కూడు కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం, అందితే వారి జీవితంలో కావాల్సింది మరేమీ లేదన్నారు. వాటన్నింటినీ జగనన్న ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంత మేలు చేసే ప్రభుతాన్ని మరలా మరలా తెచ్చుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా రామారావు, జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు, వైద్యులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల నాయకులు పాల్గొన్నారు.

జేఏఎస్‌తో అందరికీ ఆరోగ్యం..

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన జేఏఎస్ క్యాంపులతో గ్రామాల వారీగా నెలరోజులుగా అందరికి కార్పొరేట్ వైద్యం అందిందని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అన్నారు. గురువారం వల్లాపల్లి గ్రామంలో ఉచిత క్యాంపులో భాగంగా 405 మందికి వివిధ రకాల పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మందా మోహన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ డీ. సుమతి, వైద్యాధికారులు, భారతి, మమత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వల్లాపల్లిలో కిట్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం..

చీరాల టౌన్: పేదలందరికీ మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎంపీడీవో కె.నేతాజీ అన్నారు. గురువారం చీరాల రూరల్ మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆరోగ్యమైన సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ప్రతి ఇంటిలో అనారోగ్యంతో బాధపడే వారందరిని గుర్తించి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. రోగులకు ఉచితంగా మందులు కూడా ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు, వృద్ధులలో కంటి లోపాలను గుర్తించి అందుకు నివారణా చర్యలు, గర్భిణుల్లో పోషణ లోపాల నివారణ, ఆరోగ్యకరమైన శిశువులు జననానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆరోగ్యంపై ప్రజలందరికీ అవగాహన ఉండేలా పలు కార్యక్రమాలు తాము చేపడుతున్నట్లు వివరించారు. కొత్తపాలెంలో జరిగిన వైద్య శిబిరంలో 405 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు అంకాళరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, బక్కా శివప్రసాద్‌రెడ్డి, వైద్యాధికారిణి డా. శ్రీదేవి, బి.శివపార్వతి, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లబోతుల రాజ్‌కుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ బుర్ల సాంబశివరావు, శీలం వెంకటేశ్వరమ్మ, ఆజాద్, బాలకోటిరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు గుర్తుంచుకోవాలి



ఫొటో ఫ్రేములు అందిస్తున్న దాత కాశి



విద్యార్థులకు వివరిస్తున్న ఎస్సై శివకుమార్

ఇంకొల్లు (చినగంజాం): స్వాతంత్య్ర పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులను, సంఘ సంస్కర్తలను, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, వారి త్యాగాలను విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. గురువారం పాఠశాల పూర్వ విద్యార్థి శిఖాకొల్లి కాశీ పాఠశాలకు దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులు, సంఘ సంస్కర్తలు, స్వాతంత్య్ర సమరయోధులు ఫ్రేములతో కూడిన 26 చిత్రపటాలను పాఠశాలకు బహూకరించారు. సుమారు రూ 20 వేలు విలువ కలిగిన ఫొటో ఫ్రేములను పాఠశాలకు అందించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా గురువారం సంతమాగులూరు ఎస్సై శివకుమార్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లోని పరికరాలు చూపించి విధులను ఎస్సై మాట్లాడుతూ మన చుట్టు పక్కల ఏం జరుగుతుందో బాలికలు గమనించాలన్నారు.

వేడుకగా అభయాంజనేయస్వామి ప్రతిష్ట



కలశాలకు పూజలు చేస్తున్న భక్తులు



హోమంలో పాల్గొన్న విగ్రహ కమిటీ సభ్యులు

బల్లికురవ: మండలంలోని పాతమల్లాయపాలెం బస్టాప్ వద్ద అభయాంజనేయస్వామి ప్రతిష్ట వేడుకల్లో భాగంగా గురువారం వేదమంత్రోచ్చారణతో గ్రామం పులకరించింది. ప్రతిష్ఠాచార్యులు ఐనవోలు సీతారామాచార్యులు బృందంచే ఉదయం యాగశాలలో హోమాలు, కలశాలకు పూజలు, సాయంత్రం పుష్పాధి, జలాధివాసం, నవావరణ, అర్చన, హోమాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు అభయాంజనేయ స్వామి ప్రతిష్ఠా, ఆంజనేయస్వామి నామ సంకీర్తనతో భజన, రాత్రికి నాటకాలు, ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు విగ్రహ కమిటీ అధ్యక్షుడు ముద్దపాటి చంద్రశేఖర్ తెలిపారు. ఈవేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలి

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో రెవెన్యూ ఉద్యోగులతో తహశీల్దార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబందాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు. సమావేశంలో డీటీ సురేష్, ఆర్‌ఐలు అర్జున్, శేఖర్, సర్వేయర్ లోకేష్, వీఆర్వోలు ఉన్నారు.

మొక్కలే ప్రాణాధారం

ఒంగోలు అర్బన్: స్థానిక పులి వెంకటరెడ్డి కాలనీ, పున్నయ్య భవన్ రోడ్డు వద్ద రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా తమవంతు బాధ్యత నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదకరమైన చెట్లను తొలగించడంతో మొక్కలు నాటాలని సంఘం నిర్ణయించిందన్నారు. దీనిలో సంఘం నాయకులు బి. శ్యామలరావు, అంకిరెడ్డి, కంచర్ల సుబ్బారావు, మారెళ్ల వెంకటరావు, సుభాని, ప్రసాద్, శరత్‌బాబు, శేషయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

చీరాల అర్బన్: ఐఐటీ కోచింగ్ తీసుకుంటున్న పేద విద్యార్థినికి ఫీజు నిమిత్తం రోటరీ సభ్యులు, న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. గురువారం స్థానిక రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో చీరాలకు చెందిన బోగిరెడ్డి సంయుక్త అనే పేద విద్యార్థిని విజయవాడలో ఐఐటీ కోచింగ్ తీసుకుంటోంది. ఆమె భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరుతూ ఫీజు నిమిత్తం సాయాన్ని అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, జీవై ప్రసాద్, డీవీ సురేష్, డాక్టర్ ఐ.బాబూరావు, ఎంబీరామారావు, డేగల తిరుపతిరావు, నక్కల సురేష్, శివాంజనేయప్రసాద్, మోహనరావు, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రోటరీ సభ్యులు

ఈ–క్రాప్ నమోదు జాబితా ప్రదర్శన

బల్లికురవ: మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్‌లో ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాలో సామాజిక తనిఖీ నిమిత్తం గురువారం ప్రదర్శించినట్లు వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి తెలిపారు. రైతులు ఈ జాబితాలను పరిశీలించుకొని సర్వే నంబర్ విస్తీర్ణం సాగుచేసిన పంట వివరాల్లో ఏమైనా లోపాలుంటే తక్షణమే సరిచేయించుకోవాలని కోరారు. నవంబర్ 1న తుదిజాబితా ప్రదర్శిస్తారని కుమారి వివరించారు.

మేదరమెట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో మొత్తం 4 వేల ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు చేసుకున్నారని ఏవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–క్రాప్ చేసుకున్న రైతుల పేర్లు జాబితాను రైతు భరోసా కేంద్రాల వద్ద ఉంటుందని, అంతే కాకుండా గ్రామ సభలు నిర్వహించి రైతులకు పూర్తి సమాచారాన్ని అందిస్తారని చెప్పారు. ఎలాంటి సవరణలు ఉన్నా రైతు భరోసా కేంద్రాల వద్దకు వచ్చి సమస్యను లిఖిత పూర్వకంగా అందజేసి సమస్య పరిష్కరించుకోవాలని ఏవో కోరారు. ఈ–క్రాప్ నమోదు సవరణలకు ఇది చివరి అవకాశంగా ఆయన తెలిపారు.



బల్లికురవలో తుది జాబితా సరిచూసుకుంటున్న రైతులు

వలపర్ల పాఠశాలకు విద్యార్థుల వితరణ

మార్టూరు: పాఠశాలకు తమ వంతు సహకారాన్ని అందించి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు పూర్వవిద్యార్థులు. వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి ఉత్తీర్ణులైన 14 మంది విద్యార్థులు పలు ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు పొందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వారంతా కలిసి తమ పాఠశాలకు అవసరమైన రూ.30 వేల విలువైన కంప్యూటర్‌తో పాటు 50 కుర్చీలను గురువారం హెచ్‌ఎం ఎం నిర్మల, ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన పాలపర్తి పల్లవి అనే విద్యార్థినికి రాజమండ్రికి చెందిన వికాస్ ట్రస్ట్ వారు ఇంటర్ మీడియట్ టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ బహూకరించారు.



కంప్యూటర్, కుర్చీలు బహూకరిస్తున్న విద్యార్థులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి

చినగంజాం: అధికారులు, సిబ్బంది తమ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన ఎంపీపీ కార్యాలయంలో మండల పరిషత్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ తమకు కేటాయించిన విధులను సకాలంలో, సక్రమంగా నిర్వహించాలని లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపణలు వస్తున్నాయని, కార్యాలయ నిర్వాహణ తీరు సక్రమంగా లేదనే విషయం తన దృష్టికి వస్తున్నాయని చెప్పారు. ఇటువంటి ఆరోపణలు ఇకపై జరగకుండా సిబ్బంది జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. పంచాయతీల పరిధిలో మంజూరైన పనులను త్వరితగతిన ప్రారంభించాలని, దానికి సంబంధించిన కార్యాలయ పనులు పూర్తి చేసి సిబ్బందికి సరైన సూచనలు ఇవ్వాలని ఎంపీడీఓ కే స్వరూపరాణికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే స్వరూపరాణి, ఏపీఓ లక్ష్మీదేవి, ఏపీఎం అంజిబాబు, ఈఓపీఆర్డీ వేణు, ఏఈపీఆర్ దాసు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి అవకాశాలు



జిల్లా పరిశ్రమలశాఖ అధికారితో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర

చీరాల టౌన్/వేటపాలెం: నియోజకవర్గంలో ఉన్న యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర జిల్లా పరిశ్రమలశాఖ అధికారి మదన్ మోహన్‌శెట్టిని కోరారు. గురువారం బాపట్ల జిల్లాలోని జిల్లా పరిశ్రమలశాఖ అధికారిని కలిసి చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాలతో పాటుగా మున్సిపాలిటీలోని వార్డుల్లో నివాసం ఉంటున్న నిరుద్యోగ యువతకు యూనియన్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ అందించాలన్నారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నైపుణ్యాలను పెంచి స్వయం ఉపాధి అవకాశాలను, బ్యాంకు సబ్సిడీ రుణాలను కల్పించాలని కోరారు. దీనిపై జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి శాఖ ఎప్పుడు ముందుంటుందని యువతీ, వయుకులకు ఉన్న స్వయం ఉపాధి అవకాశాలపై సదస్సు, ఔత్సాహికులకు ఉపాధి అవశాలు కల్పించేందుకు కృషి చేస్తానని సురేంద్రకు హామీ ఇచ్చారు. 30 మందితో మొదటి బ్యాచ్ ట్రెనింగ్ త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. శిక్షణలో పాల్గొనాలనుకున్న యవతీ, యువకులు తనను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వనియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా నగరేశ్వరస్వామి నగరోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

అద్దంకి రూరల్: అద్దంకిలో వేంచేసిఉన్న వింధ్యావాహిని సమేత నగరేశ్వరస్వామి దేవాలయంలో దసరా నవరాత్రులు ముగింపు సందర్భంగా గురువారం రాత్రి నగరోత్సవం నిర్వహించారు. దేవస్థానం నుంచి మూడు రకాల రథాలపై వింధ్యావాహిని సమేత నగరేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ అమ్మవారు, దుర్గాదేవి అమ్మవార్లను అలంకరించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాలు, జానపద కళాకారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు వార్లు పోసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బెంచీల ఏర్పాటు



సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసిన రోటరీ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షుడు గోరంట్ల లక్ష్మీ నారాయణ సౌజన్యంతో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం శింగరకొండలోని మురళీకృష్ణ దేవాలయం వద్ద నాలుగు, రామ్‌నగర్‌లో రెండు మొత్తం ఆరు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరీ, దాత గోరంట్ల లక్ష్మీ నారాయణ, మాలాది శ్రీనివాసరావు, అద్దంకి లెవీ ప్రసాద్, జీగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మీ, షేక్ మహమ్మద్ రఫీ, అంజాద్‌బాషా పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో పారిశుద్ధ్యం అధ్వానం



హోటళ్ల ముందు ఉన్న కాల్వలో వ్యర్థాలు తీస్తున్న కార్మికులు

- కాల్వల్లో కుళ్లిన ఆహార పదార్థాలు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న హోటళ్ల నిర్వాహకులు

చీరాల రూరల్: పట్టణంలోని అంతర్గత మురుగు కాలువలు వ్యర్థాలకు నిలయాలుగా మారిపోయాయి. పట్టణంలో ఈ మధ్య కాలంలో హోటళ్ల, రెస్టారెంట్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఎక్కడ చిన్న సందు కనపడితే అక్కడ పునుగుల బండ్లు, బజ్జీల బండ్లు, ఇడ్లీ, దోస, పూరి, వంటి టిఫిన్ బండ్లు ఏర్పాటు మరో పక్క హోటళ్లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆయావాటి నుంచి వస్తున్న ఆహార వ్యర్థ పదార్థాలను మాత్రం మురుగు కాలువల్లో పడేస్తున్నారు. దీంతో మురుగునీటిలో కలిసిపోయిన వ్యర్థాలు కదలక ఎటువెళ్లలేక కుళ్లిపోయి ఆయా పరిసరాలన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. చీరాల పట్టణంలో ఈ మధ్య కాలంలో పెద్దపెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఆయా హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిపోయిన ఆహార వ్యర్థ పదార్థాలను మురుగు కాలువల్లో పారబోస్తున్నారు. తత్ఫలితంగా ఆయా ఆహార పదార్థాలు కుళ్లిపోయి పరిసరాలన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని గడియార స్తంభం సెంటర్, మోహన్ థియేటర్ సెంటర్, సంఘం థియేటర్ సెంటర్, కాంతి థియేటర్ సెంటర్, బస్టాండ్, రైల్వే స్టేషన్ సెంటర్లు, కొట్ల బజారు సెంటర్లు ఈ తరహా దుర్వాసనలతో దద్దరిల్లిపోతుంటాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.